
# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY

5



## నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

శనివారం 16 ఆగస్టు 2025




# పారదర్శకంగా ప్రజాపాలన

అల్లూరి సీతారామరాజు వేషధారణలో జడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థి

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నృత్యం చేస్తున్న తాడూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లెల చిన్నారెడ్డి, కలెక్టర్, ఎస్పీ తదితరులు

- 79వ స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి
- విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేయాలని పిలుపు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. పైరవీలతో ప్రమేయం లేకుండా ప్రతీ సంక్షేమ పథకం పేదల గడపకు తాకాలని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తితో అర్థం, పరమార్థం చేకూర్చే ప్రజాస్వామ్య పాలనకు పునాదులు వేయాలని అన్ని వర్గాల ప్రజలను ఆయన అభ్యర్థించారు. 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లెల చిన్నారెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ అమరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసినట్లు జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించేందుకు 550పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ఇటీవల శంకుస్థాపన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా 768 పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం 6కోట్ల 27లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద జిల్లాలో ఇప్పటి వరకు 464కోట్ల 88లక్షల రూపాయలు 3లక్షల 6వేల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం కింద అమ్రాబాద్ మండలంలోని మాచారంలో ఈ పథకానికి అంకురార్పణ చేసి నల్లమల ప్రాంతానికంతా విస్తరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మహాత్మాగాంధీ ఎత్తిపోతల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా వ్యవసాయానికి మహర్దశ ఏర్పడనుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

**● అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే కృతనిశ్చయంతో ఉందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వంద శాతం రాయితీపై 82 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకులు కొండా నగేష్, వంకేశ్వరం నిరంజన్, హబీబ్, ధర్మరాజు, కోటయ్య, శ్రీపురం నరసింహారెడ్డి, నాగనూల్ కృష్ణారెడ్డి, పెద్దకొత్తపల్లి మాజీ జడ్పీటీసీ మురళీధర్, పిడికళ్ల పాపమ్మ, మలిశెట్టి పద్మమ్మ, జక్కా రాజ్, ఎండి.నిజాం పాల్గొన్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



నృత్యం చేస్తున్న వెల్దండ కేజీబీవీ విద్యార్థినులు



నాగర్‌కర్నూల్ పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ఎంపీ మల్లు రవి నుంచి మెడల్ అందుకుంటున్న డీఏఆర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.నాగరాజు



ఉద్యానవన శాఖ స్టాల్స్‌ను తిలకిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

## జిల్లా పరిషత్

# ఉన్నత పాఠశాల ప్రారంభం

కందనూలు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పెద్దముద్దునూర్ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, త్రిదండి చిన జీయర్‌స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధి పట్ల తమ కట్టుబాటును మరోసారి చాటుతూ ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యతని స్తున్నామని అన్నారు. రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ కూచకుళ్ల ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు గ్రీన్ బోర్డులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో పాఠశాల బిల్డింగ్ దాత అయిన చిట్టినేని శ్రీనివాస్‌రావుకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. మా ర్కెట్ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దముద్దునూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, చిత్రంలో చినజీయర్‌స్వామి తదితరులు

# గెల్వాలాంబ సన్నిధిలో..

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పూజలు

వంగూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వంగూరు మండల కేంద్రంలో గెల్వాలాంబమాత బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రమేష్‌గౌడ్, జనార్దన్, మల్లేష్, శేఖర్, గణేష్‌రావు, వెంకటేశ్వరరావు, నారాయణరావు, నరేందర్‌రావు, సురేందర్, ఎల్లాగౌడ్ తదితరులు ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



మర్రి జనార్దన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

# విద్యపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ సంతోష్

గద్వాల సర్కిల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. గద్వాల పుర పరిధిలో గల పిలిగుంట్ల కాలనీలో శుక్రవారం 35 మంది విద్యార్థుల ప్రవేశాలతో నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం జిల్లాలో ఆరు నూతన ప్రాథమిక పాఠశాలలను మంజూరు చేసిందని కలెక్టర్ వివరించారు. త్వరలో శాశ్వత పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాఠశాల ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, సీఆర్పీలు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

## పొంగి పొర్లుతున్న దుందుభీ

- కొనసాగుతున్న వరద ఉధృతి
- డిండి డ్యామ్ వద్ద పర్యాటకుల సందడి

6



పరవళ్లు తొక్కుతున్న డిండి ప్రాజెక్టు

## స్వాతంత్ర్య వేడుకల్లో మునిసిపల్ కార్మికులకు అవమానం

- కార్యాలయం ముందు ఆందోళన

7



కార్మికులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్

# మహిళా సంఘాలకు మహర్దశ

- డీఆర్డీఏ ద్వారా వడ్డీ లేని రుణాలు పంపిణీ
- మహిళల ఖాతాల్లో జమ
- 4983 మహిళా సంఘాలకు రూ. 5.70 కోట్లు మంజూరు

గట్టు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా గ్రామాల్లోని గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు మండలాల వారిగా అర్హులైన మహిళా సంఘాల జాబితాలను ప్రభుత్వానికి అందచేయడంతో జిల్లాలోని పలు సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. గద్వాల నియోజక వర్గంలో ఆయా మండలాల్లో మహిళా సంఘాలకు అధికారికంగా చెక్కులను అందచేసే కార్యక్రమాన్ని కలెక్టర్ బీఎం సంతోష్‌తో పాటు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిలు ప్రారంభించి పూర్తి చేశారు. మహిళా సంఘాలకు గత 2005 నుంచి పావలా వడ్డీ రుణ పథకం అమల్లోకి వచ్చింది. బ్యాంకు లింకేజితో పాటు స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకునే సభ్యులకు ఇది వర్తింపజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2016వరకు ఈ విధానం కొనసాగింది. ఆటు తర్వాత 2017నుంచి పావలా వడ్డీ డబ్బులు వారి ఖాతాల్లో వేయడం నిలిచిపోయింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించేందుకు కసరత్తు చేసి అర్హులైన మహిళలకు వడ్డీ లేని రుణాలు అందచేస్తున్నది. దీంతో మహిళా సంఘాలకు మహర్ధశ వచ్చినట్లైంది. వడ్డీ లేని రుణాలువారి ఖాతాల్లో జమ కావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



**● అర్హులైన సంఘాలకు రుణాలు**

జిల్లాలో అర్హులైన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలో మొత్తం 4983 సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. డీఆర్డీఏ పరిధిలోని 6984 గ్రూపులు ఉండగా ఇందులో 4983 గ్రూపులకు వడ్డీలేని రుణాలు మంజూరయ్యాయి. మొత్తం రూ.5.70 కోట్లు మహిళల ఖాతాల్లో జమ అయ్యాయి. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది.

- భువనగిరి శ్రీనివాస్, డీఆర్డీఏ అదనపు పీడీ

**● జిల్లా వ్యాప్తంగా..**

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీల్లో 6984 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 77726 మంది సభ్యులు ఉండగా ఇందులో 4983 మహిళా సంఘాలకు 2024-25 సంవత్సరానికి గాను రూ. 5.71 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. ఇందులో మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇప్పటికే పలు పథకాలను వర్తింప చేశారు.

మున్ముందు మహిళా సంఘాల ద్వారా రూ. కోటి వరకు ఇచ్చి స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.



గట్టులో వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే(ఫైల్)

**మండలాల వారీగా మంజూరైన వడ్డీ లేని రుణాలు**

| మండలం | గ్రూపుల సంఖ్య | మొత్తం అమౌంటు |
|---|---|---|
| అలంపూర్ | 331 | 4004696 |
| ధరూర్ | 470 | 4941774 |
| గద్వాల | 463 | 5061048 |
| గట్టు | 495 | 4796700 |
| అయిజ | 387 | 4523664 |
| ఇటిక్యాల | 550 | 5905375 |
| కేటీదొడ్డి | 337 | 3461534 |
| మల్దకల్ | 618 | 7218901 |
| మానవపాడు | 377 | 4601093 |
| రాజోళి | 294 | 4005235 |
| ఉండవల్లి | 377 | 4784516 |
| వడ్డేపల్లి | 284 | 3726469 |
| మొత్తం | 4983 | 57031005 |

# వల విసిరె. చేప చిక్కె..

**చేపల వేటలో..** మత్స్యకారులు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. వలలు విసురుతూ చేపలు పడుతున్నారు. ఇటీవల విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ఆ నీటికి వరద తోడవడంతో ఊకచెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని పామాపురం వద్ద ఉన్న ఊకచెట్టు చెక్ డ్యాంలో అతిపెద్ద శివుడి విగ్రహం ముందు అలుగు పారుతోంది. దీంతో వాగులో మత్స్యకారులు శుక్రవారం వల వేసి చేపలు పడుతున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

క్లిక్.. క్లిక్..






మహబూబ్‌నగర్‌లో వ్యవసాయ శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో విద్యుత్‌శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో గృహనిర్మాణ శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో నగరపాలక సంస్థ శకటం


ఏకో టూరిజం శకటం

# స్వాతంత్ర్య సంబురం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. దేశభక్తి గీతాలు మారుమోగాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ఈ సందర్భంగా పోలీసు బలగాలు వందన సమర్పణ చేశాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన వేడుకలకు ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నారాయణపేటలో పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఢిల్లీలో అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, వనపర్తిలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

- నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న వెల్దండ కేజీబీవీ విద్యార్థినులు


మహబూబ్‌నగర్‌లో జెండాతో చిన్నారి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న జడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు


జోగులాంబ గద్వాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు


వనపర్తిలో నృత్యం చేస్తున్న చిన్నారులు


నృత్యం చేస్తున్న వెల్దండ కేజీబీవీ విద్యార్థినులు


గద్వాలలో గాంధీ విగ్రహం వద్ద చిన్నారులు


మహబూబ్‌నగర్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నృత్యం చేస్తున్న జడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు


నారాయణపేటలో నృత్యం చేస్తున్న చిన్నారులు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న జెడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు

## గద్వాల్ అనుకొని గజ్వేల్‌కు..

- వృద్ధుడిని చేరదీసిన ఎస్ఐ రవికుమార్
- కుటుంబ సభ్యులకు అప్పగింత

గజ్వేల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గద్వాల్ అనుకుని గజ్వేల్‌కు వెళ్లిన ఓ వృద్ధుడిని అక్కడి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ చేరదీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారికి అప్పగించారు. జోగులాంబ గద్వాల జిల్లా, ధరూరు మండలం రాయలపాడు గ్రామానికి చెందిన చిన్న నాగప్ప(70) ఆధార్‌కార్డులో మార్పు కోసం బుధవారం తన కొడుకుతో కలసి అమీర్‌పేటకు వెళ్లారు. కానీ ఒరిజినల్ ఆధార్ కార్డు మరిచిపోవడంతో, తీసుకొస్తానని చెప్పిన కుమారుడు, అతడిని కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉంచి, వెళ్లిపోయాడు. గురువారం మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్న నాగప్ప స్టేషన్ నుంచి బయటకు వచ్చి, అక్కడున్న వారిని గద్వాలకు ఎలా వెళ్లాలని అడిగాడు. కానీ వారు గజ్వేల్ అని భావించారు. జూబ్లీ బస్‌స్టేషన్‌లో గజ్వేల్ బస్సు ఎక్కించారు. గజ్వేల్ బస్టాండ్‌లో బస్సు దిగిన నాగప్పకు ఏం చేయాలో అర్థం కాలేదు. శుక్రవారం గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని క్యాసారం రోడ్డులోని చెరువు వద్ద కూర్చొని ఏడుస్తున్నాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ సంతోష్‌లు అతడిని చూశారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి భోజనం అందించారు. వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు తెలిపారు.

వారు వచ్చాక, వివరాలు తెలుసుకొని నాగప్పను వారికి అప్పగించారు. తన తండ్రిని సురక్షితంగా అప్పగించిన పోలీసులకు కొడుకు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన


కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కోటి కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణం నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్ దేశ్‌పాండే మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ కోటి కుంకుమార్చన నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని మహిళలతో పాటు, పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. ఈ పూజా కార్యక్రమాలు ఇరువెంటి శ్రావణ్ శర్మ పూరోహితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## పొంగి పొర్లుతున్న దుందుభీ


డిండీ డ్యామ్ వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

- కొనసాగుతున్న వరద ఉధృతి
- డిండి డ్యామ్ వద్ద పర్యాటకుల సందడి

ఉప్పునుంతల/తాడూరు/ అచ్చంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేని వర్షాలతో దుందుభీ నది పరవళ్లు తొక్కుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, నల్లగొండ సరిహద్దులోని డిండీ ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్నది. దీంతో గురువారం సమీప గ్రామాల ప్రజలతో పాటు, పర్యాటకులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద సందడి నెలకొన్నది. ఈ ప్రాజెక్టు శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో పర్యాటకుల తాకిడి అధికంగా కనిపించింది. శ్రీశైలం, మద్దిమడుగు, మల్లెలతీర్థం, ఉమామహేశ్వరం తదితర క్షేత్రాలకు వెళ్తున్న ప్రజలు ప్రాజెక్టు వద్ద ఆగి దుందుభీ పరవళ్లను తిలకిస్తున్నారు. సెల్‌ఫోన్ కెమెరాల్లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సంబురపడ్డారు. ప్రాజెక్టు నిండటంతో పంటలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు, ఉపాధి లభిస్తుందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నది వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా పర్యాటకుల తాకిడి అధికం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

### గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

వర్షం కొంత తెరిపినిచ్చినా, దుందుభీ నదికి వరద ఉధృతి మాత్రం కొనసాగుతూనే ఉంది. దీంతో నదీ తీర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. మేడిపూర్ వద్ద కూడా నది పరవళ్లు తొక్కుతోంది. చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిని కేసరి సముద్రం చెరువు బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తిర్మలాపూర్ గ్రామస్థులు పుట్టి సహాయంతో రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. అచ్చంపేట మండల పరిధిలోని మన్నెవారిపల్లి సమీపంలో వాగును డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, తహసీల్దార్ సైదులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నెవారిపల్లి నుంచి చందంపేటకు వెళ్ళే రహదారిపై వాగు పారు తున్నందున ఎవరూ దాటేందుకు ప్రయత్నించొద్దన్నా రు. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.


అలుగు పారుతున్న సింగోటం శ్రీవారి సముద్రం

### అలుగు పారుతున్న శ్రీవారి సముద్రం

కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం సమీపంలో సురభిరాజుల కాలంలో నిర్మించిన శ్రీవారి సముద్రం నిండు నీటితో కళకళలాడుతోంది. అలుగు పారుతూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. చెరువు అందాలను తిలకించేందుకు మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు తరలివస్తున్నారు. అలుగు వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.


మేడిపూర్ గ్రామం వద్ద కల్వకుర్తి నంద్యాల జాతీయ రహదారి హైలెవల్ వంతెన కింది నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి నది


చెర్లతిర్మలాపూర్ ఉయ్యాలవాడ గ్రామాల మధ్య కేసరి సముద్రం నీళ్లు రహదారిపై మల్లుకోవడంతో పుట్టిలో వెళ్తున్న గ్రామస్థులు


మన్నెవారిపల్లి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తునన ఎమ్మెల్యే వంశీకష్ణ

## యువత ముందడుగు వేయాలి

- అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు
- శ్రమదానం చేసిన పోలీసులు
- మంత్రాలయం రహదారికి మరమ్మతులు


శ్రమదానంతో కల్వర్టు పనులు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

అయిజ, ఆగస్టు 15 (అంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందడుగు వేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో మంత్రాలయం, ఎమ్మిగనూర్ రహదారిపై, అయిజ సమీపంలోని పోలోని వాగు మీదున్న తాత్కాలిక కల్వర్టు దెబ్బతిన్నది. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు స్పందించి తాత్కాలిక మరమ్మతు చేయించారు. శుక్రవారం ఈ కల్వర్టుపై భారీ లారీ ఇరుక్కుపోవడంతో రహదారి మరింతగా దెబ్బతినడంతో మరోమారు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ, తమ సిబ్బంది, స్థానికుల సహకారంతో శుక్రవారం శ్రమదానం చేశారు. రహదారిపై సొంత ఖర్చుతో మొర్రం వేయించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రంజిత్‌కుమార్, రవి, జగదీశ్ పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పట్టించుకోని పాలకులు

- ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్


మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్

అమరచింత, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్ విమర్శించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాజన్న అధ్యక్షతన వనపర్తి జిల్లా, అమరచింతలోని మార్క్స్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ దిగుబడులకు కనీస మద్దతు ధర అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మద్ధతు ధర కోసం యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. సభకు టీయూసీఐ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, నాయకులు అంజనేయులు, వాసారెడ్డి, వెంకటయ్య, మహేంద్రాచారి, ఆశన్న, భీమన్న, బాలస్వామి పాల్గొన్నారు.

## రేపు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 17న ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించనున్న జి. రాజేంద్రప్రసాద్ స్మారక 11వ రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 17న ఉదయం 9 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో కోచ్ సునీల్ కుమార్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

## ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటిక్యాల ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలంలోని ఎదుట్ల గ్రామానికి చెందిన సాయిబాబా (40) 5 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. గత ఏడాది కుమార్తె పెళ్లి కోసం అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అతడు గత మంగళవారం తిరుపతికి వెళ్తున్నానని భార్య లక్ష్మికి చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కనున్న చెటుకుఉ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన నెంబర్‌కు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులు విద్యార్థి ఆత్మహత్య

వెల్దండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలైన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రానికి చెందిన కొండ్రేటి కృష్ణయ్య, భారతమ్మ దంపతుల కుమారుడు శివప్రసాద్ (18) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. అతడు కొంతకాలంటా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. అందుకోసం చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై తల్లి భారతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి


పశువుల షెడ్‌లో మృతి చెందిన ఆవులు

రాజాపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో గురువారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి చెందాయి. రాజాపూర్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలం తిరుమలగిరి తండాకు చెందిన రైతు అయిన జర్పుల హన్మంతు గురువారం సాయంత్రం ఆవులను షెడ్‌లో ఉంచి మేత వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 4 గంటలకు షెడ్ దగ్గరకు వచ్చి చూడగా, నాలుగు ఆవులు చనిపోయి కనిపించాయి. రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు తెగి షెడ్డుపై పడటంతో అవి విద్యుదాఘాతానికి గురై చనిపోయినట్లు గుర్తించాడు. వాటి విలువ రూ. 4.80 లక్షలు ఉంటుందని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్తి నష్టం


షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైన వస్తు సామగ్రితో బాధితుడు బార్కి రామలింగన్న

అయిజ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన బార్కి రామలింగన్న ఇంటి వెనుకనున్న చిన్న గోదాంలో బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను నిల్వ ఉంచాడు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గోదాంలో మంటలు చెలరేగి, అన్ని వస్తువులూ కాలిబూడిదయ్యాయి. దీంతో తమకు దాదాపు రూ. 4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న ఆర్ఐ భరత్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

# కృష్ణంపల్లి చెరువు కట్టకు గండి

» గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య

» అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు


గుర్తు తెలియని వ్యక్తులు చెరువుకు గండి కొట్టడంతో వృథాగా పారుతున్న సాగునీరు

అమరచింత, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మండల పరిధిలోని కృష్ణంపల్లి చెరువు (రాంరెడ్డి కుంట) కట్టను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కట్టకు గండి కొట్టడంతో సాగునీరు వృథాగా అవుతోంది. గ్రామస్థులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వే నెంబర్ 16, 17లలో రాంరెడ్డి కుంట చెరువు కట్టకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని గడ్డపారలతో పెద్ద రంధ్రం చేశారు. దీంతో చెరువులోని నీరంతా వృథా అవుతోంది. చుట్టుపక్కల రైతులు గమనించి నీటి పారుదల అధికారులు, తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు గ్రామానికి చేరుకొని చెరువుకట్టను పరిశీలించారు. ఘటనపై రైతుల ఫిర్యాదు మేరకు డీఈ, ఏఈలు పంచనామా చేసి, తహసీల్దార్‌కు, అమరచింత పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే చెరువుకు గండి కొట్టారని, గతంలోనూ అందుకు ప్రయత్నించారని రైతులు తెలిపారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## వర్షాలకు కూలిన ఇల్లు


కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న సెక్రటరీ రజియాబేగం

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరులో మట్టి ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన వడ్ల జయలక్ష్మి, శేరువయ్య దంపతులు తమ కుమారుడితో కలిసి తమ పూర్వీకులు కట్టించిన మట్టి ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గురువారం రాత్రి ఆ ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పిందని మాజీ సర్పంచి శ్రీలత తెలిపారు. సమాచారం అందుకున్న కార్యదర్శి రజియా బేగం, ఆర్ఐ నాగరాజులు కూలిన ఇంటిని పరిశీలించారు.

# దళితవాడలో అక్షర వెలుగులు

» ఫలించిన డీటీఎఫ్ నాయకుల కృషి
» మక్తల్‌లో రెండు కొత్త ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు
» మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఏర్పాటు
» జగ్జీవన్‌రామ్, బీసీ కాలనీల్లో ప్రారంభం


జగ్జీవన్‌రామ్ కాలనీలో పాఠశాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి (ఫైల్)


చిన్నారులు, మహిళతో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు హైమావతి (ఫైల్)

నారాయణపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : దళిత విద్యార్థుల జీవితాల్లో అక్షర వెలుగులు విరబూశాయి. మక్తల్ పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ కాలనీ, బీసీ కాలనీలో కొత్తగా రెండు ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. ఆయా కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) గుర్తించింది. సంఘం నాయకులు హైమావతి, సూర్యచంద్రలు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వాకిటి శ్రీహరితో పాటు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, గత, ప్రస్తుత కలెక్టర్లు కోయ శ్రీహర్ష, సిక్తా పట్నాయక్, డీఈవో గోవిందరాజులు, మక్తల్ ఎంఈవోలు వెంకటయ్య, అనిల్‌గౌడ్‌కు వినతిపత్రాలు ఇచ్చి సమస్యను వివరించారు.

పూరి గుడిసెల్లో నివసించే నిరుపేద చిన్నారులకు ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యను అందు బాటులోకి తీసుకురావాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో మక్తల్‌కు రెండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. బాబూ జజ్జీవన్‌రామ్ కాలనీ, బీసీ కాలనీలల్లో జూలై 29న రెండు ప్రభుత్వ పాఠశాలలను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు.

### ఒకటి అద్దె, మరొకటి ప్రభుత్వ భవనం

మక్తల్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలోని పాల శీతలీకరణ భవనంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒకటవ తరగతిలో 25 మంది విద్యార్థులు చేరి, విద్యాభ్యాసం చేస్తున్నారు. డిప్యుటేసన్‌పై ఉపాధ్యాయురాలు నందిత విద్యాబోధన చేస్తున్నారు. బీసీ కాలనీలోని ఓ అద్దె భవనంలో ప్రారంభించిన ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 35 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆ కాలనీలకు చెందిన మరో వంద మంది విద్యార్థులు దూరంగా ఉన్న చాకలిగేరి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు కూడా ఈ కొత్త పాఠశాలల్లో చదువుకునేలా 5 తరగతులను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### 2015 నుంచే ప్రయత్నాలు

జగ్గీవన్‌రామ్ కాలనీ, బీసీ కాలనీల్లో ఎస్సీ ఉపకులాలైన సంచార బుడగజంగం, వీర ముష్టి, దళితులు నివసిస్తున్నారు. అందుబాటులో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో వారి పిల్లలు చదువుకుఉ దూరం అవుతున్నారు. ఆర్థిక స్థోమత లేని కాలనీవాసులు గతంలో కొందరు బాలికలకు గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేశారు. మరికొందరు భిక్షాటనకు వెళ్లేవారు. డీటీఎఫ్ ప్రస్తుత జిల్లా అధ్యక్షురాలు హైమావతి బదిలీపై చాకలిగేరి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు.

గ్రామ చివరన పూరి గుడిసెల్లో నివసించే పేద కుటుంబాల పిల్లలు చదువకు దూరం అవు తున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. దీంతో ఆ మె వారి తల్లిదండ్రులను కలిసి పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించారు. 2015లో మూడు కిలోమీటర్ల దూరంలోని తమ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అయితే వారు కాలినడకన వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగాయి. దీంతో 2017-2018లో విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. కొంతకాలం తానే సొంతంగా ఆటో చార్జీలను చెల్లించారు. ఆ తర్వాత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, విద్యార్థులు బడికి వచ్చేందుకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

### ఫలించిన 10 ఏళ్ల ప్రయత్నం



నిరుపేద పిల్లలు చదువుకు దూరం కాకూడదని నేను 10 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం నేటికి ఫలించింది. చాకలిగేరి ప్రభుత్వ పాఠశాలలో 2015-16లో 19 మంది విద్యార్థులు ఉండేవారు. జగ్జీవన్‌రామ్, బీసీ కాలనీల్లో తల్లిదండ్రులను కలిసి, వారి పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించడంతో విద్యార్థుల సంఖ్య 84కు పెరిగింది. కానీ పాఠశాల దూరం కావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. అందరికీ విద్యను అందించాలన్న స్ఫూర్తితో పని చేసిన పూలే దంపతులు, అంబేడ్కర్ నాకు ఆదర్శం.

\- డీజీ హైమావతి, డీటీఎఫ్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలు

### ఏడాదికే మూత పడిన పాఠశాల

కరోనా వ్యాప్తి సమయంలో ఉపాధ్యాయురాలు హైమావతి స్వయంగా పేదల గుడిసెల వద్దకే వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారికి ఆధార్ కార్డుతో పాటు, జనన, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఇప్పించారు. బ్యాంకు ఖాతాలు తెరిపించారు. సమస్యను అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన 2022-23 విద్యా సంవత్సరంలో బీసీ కాలనీలో తాత్కాలికంగా పాఠశాలను ఏర్పాటు చేయించారు. ఒక వలంటీర్‌ను నియమించి, 154 మంది విద్యార్థులతో కొనసాగించారు. ఆయన బదిలీ అవడం, ఆ తర్వాత వేసవి సెలవులు రావడంతో ఆ పాఠశాల మూతపడింది. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ కాలనీల్లో పాఠశాల ఏర్పాటు అవసరాన్ని సంఘం నాయకులు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో రెండు ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి.

# తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు జాతీయ పార్టీల కబంధ హస్తాల నుంచి తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చినది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును తప్పుపట్టిన కుహనా మేధావి వర్గం భారీ వ్యయంతో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నిర్మిస్తున్న బనకచర్లను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, గోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసుకొని లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. 10 సంవత్సరాల పాలనలో సాగు, తాగునీరు, విద్య వైద్య రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపినట్లు చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు అందించి రైతులను రాజులుగా మలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకున్నదని, రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో మునిసిపల్ కార్మికులకు అవమానం

» కార్యాలయం ముందు ఆందోళన


మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 15 : (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర దిన వేడుకల్లో తమకు అవమానం జరిగిందంటూ మునిసిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మునిసిపల్ కార్యాలయం ముందు శుక్రవారం ఉదయం 8.00 గంటలకు కమిషనర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అప్పటి వరకు వార్డుల్లో పారిశుధ్య పనులు చేసిన కార్మికులు 8.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. వారు కార్యాలయం లోనికి వెళ్తుండగా, వార్డు అధికారి గణేష్ అడ్డుకున్నారు. బయటనే ఉండండి, మిఠాయిలు తెచ్చి ఇస్తానని చెప్పాడు. దీంతో కార్మికులు కార్యాలయం ముందు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ మురళి, ఎస్ఐ విజయ్ భాస్కర్ వారితో మాట్లాడి విషయం తెలుసుకొని, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్మికులందరూ పారిశుధ్య పనుల్లో ఉంటారన్న ఉద్దేశంతో వేడుకలకు పిలువలేదని, తప్పుగా భావించొద్దని కోరారు. తమను కార్యాలయంలోకి రానివ్వలేదని కార్మికులు చెప్పడంతో, ఈ విషయంపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### ఎవరూ రాకముందే జెండా ఆవిష్కరణ

మరికల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఇతర అధికారులు, నాయకులు రాకముందే జడ్పీ సీఈవో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో జరిగింది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాల్సి ఉంది. కానీ జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్ మండల కాంప్లెక్స్ భవనం ముందు ఉదయం 7:30 గంటలకే జాతీయ పతాకాన్ని ఎగురవేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత తహసీల్దార్ రాంకోటి, ఎంపీడీవో కొండన్న ఇతర అధికారులు, నాయకులు అక్కడికి చేరుకున్నారు.

అప్పటికే జెండా ఆవిష్కరణ పూర్తి కావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నారాయణపేటలో మంత్రి వాకిటి శ్రీహరి కార్యక్రమానికి వెళ్తున్నట్లు సీఈవో చెప్పారని సిబ్బంది తెలిపారు.

# న్యాయం జరిగే వరకు పోరాటం

» వ్యవసాయ కార్మిక సంఘం

జిల్లా కార్యదర్శి గోపాల్



కానుకుర్తి దీక్షలో రైతులకు సంఘీభావం తెలుపుతున్న రాజ్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట/ దామరగిద్ద, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : నిర్వాసితులు, రైతులకు న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా కార్యదర్శి గోపాల్ స్పష్టం చేశారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులు, రైతులు జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గోపాల్ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. అంతకుముందు దీక్షా శిబిరం ముందు నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు మశ్చేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మరాజు, నాయకులు కుర్వ హనుమంత్, లక్ష్మీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, నాయకులు నరహరి, పవన్, నవీన్ పాల్గొన్నారు.

### కానుకుర్తిలో 9వ రోజుకు చేరిన దీక్ష

దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో నిర్వాసితులు, రైతులు చేపట్టిన రిలే నిరాహర దీక్షలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి, సభ్యులతో కలిసి దీక్షలకు మద్దతు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలన్నారు. దీక్షలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, వెంకటేశ్, శివరాజ్, వెంకటరావు, రాజప్ప పాల్గొన్నారు.

## అలంపూర్ ఆలయాల ఈవోగా దీప్తి


ఈవోగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన దీప్తి

అలంపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల నూతన కార్యనిర్వహణాధికారిగా ఏ దీప్తి నియమితులయ్యారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఈవోగా ఉన్న పురేందర్ కుమార్ జమ్మిచేడ్ దేవాలయానికి బదిలీ అయ్యారు.

## యోగా పోటీల్లో సత్తా చాటిన ఇటిక్యాల గురుకుల విద్యార్థులు


ఇటిక్యాలలో విద్యార్థులను సత్కరిస్తున్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

ఇటిక్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని మధురైలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి యోగాపోటీల్లో ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎం. కార్తీక్ ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకోగా, కె.రాజశేఖర్ ఆరవ స్థానంలో నిలిచాడు. అలాగే విధంగా రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన జూనియర్ నేషనల్ దూ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రంజిత్‌కుమార్, భాస్కర్‌లు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ మమత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు కృష్ణ, పీడీ రవిప్రకాష్, పీఈటీ సుజాతలు సన్మానించారు.

## కొండారెడ్డిపల్లి పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం


ఇంటర్‌నెట్ సేవలను ప్రారంభిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

వంగూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వగ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంటర్‌నెట్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించడంతో పాటు, ప్రపంచ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇంటర్‌నెట్ సేవలు ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామీణ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రక్రియలో ఇది ముఖ్యమైన అన్నారు. తమ పాఠశాలకు ఇంటర్‌నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీ ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఇంటర్వ్యూ.**

## నీటి సరఫరాపై గ్రామ పంచాయతీల పర్యవేక్షణ ఉండాలి

**- హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ**



అచ్చంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేసి నల్లాలు నిర్మించిన ట్యాంకులు నాలుగు కాలాల పాటు మన్నికతో ఉండాలన్నా గ్రామపంచాయతీలు నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తే ఎలాంటి సమస్యలు రావని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హేమలత ఆంధ్రజ్యోతి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**అచ్చంపేట డివిజన్‌లో ఎన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫ రా చేస్తున్నారు?**

అచ్చంపేట డివిజన్‌లో ఆరు మండలాల ప రిధిలో 206 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నాం.

**డివిజన్‌లో ఎన్ని తాగునీటి ట్యాంకులు ఉన్నాయి?**

అచ్చంపేట డివిజన్‌లో మిషన్‌భగీరథ ద్వారా 161 ట్యాంకులు నిర్మించాం. గతంలో పాతవి 172 ట్యాంకులు ఉన్నాయి, 20 లీటర్లు మొద లుకొని 120 వేల లీటర్ల స్వామర్థం కల్గిన ట్యాంకులు ఉన్నాయి.

**చెంచుపెంటలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందా?**

నల్లమలలోని చెంచుపెంటలకు మిషన్ భగీరథ పైపులైన్‌లు వేసేందుకు అటవీశాఖ అనుమతించలేదు. దీంతో మిషన్ భగీరథ నిధులతో సోలార్ పంపుసెట్లు బిగించి తాగునీటి సరఫరా చేస్తున్నాం.

**గ్రామాల్లో పూర్తి స్థాయిలో నల్లాలు బిగించలేదనే ఆరోపణలపైఏమంటారు ?**

ఆరోపణలు అవాస్తం. డివిజన్‌లో మొత్తం 59,402 నల్లాలు బిగించాం. నిర్వహణ గ్రామ పంచాయతీలు చూసుకోవాలి. చాలా వరకు నల్లాలను వూడదీసి సంపులోకి వృథాగా వేయడం వల్ల నీరు వృథా అవుతోంది.

**న్యూస్ బాక్స్**

### వెల్దండకు ఉత్తమ బీఎంసీయూ అవార్డు



గుత్తా అమిత్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న యాఖూబ్

వెల్దండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ)కి నాణ్యమైన పాలను సరఫరా చేస్తున్న వెల్దండ బీఎంసీయూ ఉత్తమ అవార్డు దక్కింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రావిరాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి చేతుల మీదుగా బీఎంసీయూ అధ్యక్షుడు ఎండీ యాఖూబ్ ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

### సొసైటీల గడుపు పెంపుపై హర్షం

ఉప్పునుంతల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పదవీకాలం రాష్ట్ర ప్రభుత్వం మరో 6 నెలలు పెంచడంపై సింగిల్‌విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

### పాఠశాల అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ పద్మభాస్కర్‌రెడ్డి

వంగూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి నూతనంగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ అభివృద్ధికి గాను మాజీ సర్పంచ్ పద్మభాస్కర్ రెడ్డి శుక్రవారం రూ. లక్ష చెక్కును అడ్వైజర్ కమిటీ సభ్యులకు అందజేశారు. పద్మభాస్కర్ రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు పూలమాల, శాలువాతో సత్కరించారు.

### కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

అమ్రాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ మండల నాయకుడు నోముల జగన్ గౌడ్ శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరి నారాయణ గౌడ్, సింగిల్ విండో చైర్మన్, పోషం గణేష్ పాల్గొన్నారు.

### మార్చాలలో బీసీ కమిటీ ఏర్పాటు

కల్వకుర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో బీసీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా లక్ష్మయ్య, అధ్యక్షుడుగా కాశీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పాండు, కోశాధికారిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా గౌసోద్దీన్, శ్రీనివాసులు, శ్రీకాంత్‌గౌడ్, శ్రీకాంత్, మహేష్, రామకృష్ణ, రాజశేఖర్, పరమేష్, నరేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుప ర్చాలని బీసీ కమిటీ తీర్మానం చేసింది. కార్యక్రమంలో కడాల మల్లేష్, సురేష్, నరేష్‌గౌడ్, ఎండి.నిజాముద్దీన్, బాలకిష్టగౌడ్, వెంకటయ్య, ఆంజనేయులు, రవి, సాయిరాం, సాయి, ఖాజా, రమేష్, జంగయ్య, యాదగిరి ఉన్నారు.



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం వద్ద జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వృథా కానివ్వం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో జెండాష్కరించిన కలెక్టర్ సంతోష్
- జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- విద్యార్థుల ప్రతిభకు నగదు, ప్రశంసలు

నాగర్‌కర్నూల్/ కందనూలు/ నాగర్‌కర్నూల్ టౌన్/ అచ్చంపేట/టౌన్/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ బిజినేపల్లి/ తెలకపల్లి/ తిమ్మాజిపేట/ తాడూరు/ ఉప్పునుంతల/ అమ్రాబాద్/ బ్రహ్మగిరి/ వెల్దండ/ వంగూరు/ చారకొండ/ ఊర్కొండ/ పెద్దకొత్తపల్లి/ కోడేరు/ పెంట్లవెల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఊరూరా జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెల్లవారుజాము నుంచే పాఠశాలల విద్యార్థులచేత ప్రభాతభేరి నిర్వహించి, జాతీయ నాయకులు, స్వాతం త్ర్య సమరయోధుల త్యాగాన్ని, కీర్తిని శ్లాఘిస్తూ జై కొట్టారు. పాఠశాలలు, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు స్టేషన్లు, వ్యవసాయ, సింగిల్‌విండో, మునిసిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల, ఇతర కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మిఠాయిలు పంచారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పార్టీల కార్యాల యాల వద్ద స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ బదావత్ సంతోష్ మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ అమరేందర్, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, పాత్రికేయులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో తన సతీమణితో సరితతో జాతీయ జెండావిష్క రించారు. ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా వచ్చిన భారత స్వాంతంత్ర్యాన్ని వృథా కానివ్వబోమని ఎమ్మెల్యే అన్నారు.

అనంతరం ఎంపీ మల్లు రవితో కలిసి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలంలో జాతీయ జెండావిష్కరణ చేశారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కూచకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు 31గ్రీన్ బోర్డులు, వికలాంగులకు వీల్‌చైర్లు అందజేశారు.

• బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. • మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తిమ్మాజిపేట పాండు జాతీయ పతాకావిష్కరణ చేశారు. • బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. • విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రామచంద్రారెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. • జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. • నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

• ఇదిలా ఉండగా గత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో, ఇంటర్ కళాశాలల్లో చదివి ప్రతిభ కనబర్చిని విద్యార్థులకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీల చేతులు మీదుగా పురస్కారాలు అందజేశారు.

• అచ్చంపేట నియోజకవర్గంలో వాడవాడలా శుక్రవారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ జాతీయ జెండా ఎగరవేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జెండావిష్కరణ చేశారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు జాతీయ జెండా ఎగరవేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోకల మనోహర్ ఆధ్వర్యంలో తెలుగుతల్లి విగ్రహం దగ్గర జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో మాధవి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు,

• కొల్లాపూర్ మండల ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆర్డీవో భన్సీలాల్ ఆవిష్కరించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ చైర్‌పర్సన్, జూనియర్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని జాతీయ జెండా ఆవిష్కరించి, మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిల్‌విండో డైరెక్టర్ జూపల్లి రఘుపతిరావు జెండా ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. • కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మునిసిపల్ కార్యాలయంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి త్రివర్ణ కోర్టు ఆవరణలో న్యాయాధికారులు శ్రీదేవి, కావ్యలు, పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వృద్ధాశ్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

• బిజినేపల్లి, తెలకపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, ఉప్పునుంతల, అమ్రాబాద్, బ్రహ్మగిరి, వెల్దండ, వంగూరు, చారకొండ, ఊర్కొండ, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్లను, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులు, అనధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



నాగర్‌కర్నూల్‌లో ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు చెక్కులు అందుకున్న విద్యార్థులతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్, సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్



నాగర్‌కర్నూల్‌లో బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు



నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, నాయకులు



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కల్వకుర్తి కోర్టు ఆవరణలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న న్యాయాధికారులు శ్రీదేవి, కావ్య, న్యాయవాదులు



తెలకపల్లి : ప్రభాతత భేరీలో విన్యాసాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



కొల్లాపూర్ కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్, జూనియర్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్

**- గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్**

అచ్చంపేటటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఎం దుకు స్పందించడంలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం 42శాతం రిజర్వేషన్లు అమలు పరిచేవరకు బీసీలు పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెల17న అన్ని బీసీ కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ నెల 20న పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాలన్నారు. బీసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కాశన్న యాదవ్, అమ్రాబాద్ సింగిల్‌విండో చైర్మన్ పోశం గణేష్, నాయకులు హరినారాయణ గౌడ్, నాయకులు చరణ్‌గౌడ్, నిరంజన్, లాలు యాదవ్, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

## 20న మేడ్చల్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు

**- జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్**

కొల్లాపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం కొల్లాపూర్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభల మహాసభల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, మొలచింతలపల్లి శాఖ కార్యదర్శి జంగం శివుడు, రాము, ఇటికల కురుమయ్య, శేఖర్, దాము, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం



మైసమ్మ దేవతను దర్శించుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో మైసమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ శ్రీశైలం, ఎడ్మ సత్యంలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రాములు, శ్రీకాంత్, నరసింహ, రాంభూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాబీదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్లతో సురక్షిత తాగునీరు

**- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి నీటి బిందెను గిరిజన మహిళకు ఎత్తుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మినరల్ వాటర్ ప్లాంట్‌తో ఫ్లోరైడ్ రహిత సురక్షిత తాగునీరును ప్రజలకు అందించడమే లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తర్నికల్‌తండాలో తన సొంత డబ్బులు రూ.లక్ష 50 వేలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. బిందెల్లో నీటిని నింపి గిరిజన మహిళలకు ఎత్తారు. జాబ్‌మేళాలు, ప్రజలకు వైద్య శిబిరాలు, మౌలిక వసతులు కల్పించేందుకు సీసీరోడ్లు, దేవాలయాల నిర్మాణాలకు ఆర్థిక సహకారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సోమ్లానాయక్, రాజునాయక్, దీప్లానాయక్, గోపాల్, చిన్నా, వినోద్, గణేష్, మునియా, తులసీరాం, ప్రవీణ్, వినోద్, ప్రమోద్, ఆనంద్, రవీందర్, సభ్యులు ఉన్నారు.

### మెరిట్ విద్యార్థులకు నగదు అందజేత

తెలకపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద మెరిట్ విద్యార్థులకు వరదాత సిగ్మా మైక్రోసిస్టం మేనిజింగ్ డైరెక్టర్ చీమర్ల దామోదర్‌రెడ్డి అందిస్తున్న నగదు ప్రోత్సాహకాలు సీఎల్‌ఆర్ సంస్థ కరస్పాండెంట్ వి.రాజు మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలకపల్లి, తాడూరు, నాగర్‌కర్నూల్ మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు 2 నెలలకు సంబంధించిన నగదు 91,200 రూపాయలు పురస్కారాలు అందజేశారు. మెరిట్ పారితోషకాన్ని ఎనిమిదేళ్లగా మెరిట్ విద్యార్థులకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఎల్‌ఆర్ విద్యా సంస్థ ప్రిన్సిపల్స్ ఎం.ప్రకాశ్‌రెడ్డి, సందీప్ కుమార్, అధ్యాపకులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు సేవా పతకాలు



ఎస్పీ నుంచి సేవా పతకం అందుకుంటున్న బిజినేపల్లి ఏఎస్ఐ బి.శ్రీనివాసులు

కందనూలు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉత్తమ సేవలం దించిన పోలీస్ అధికారులకు స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శుక్రవారం సేవా పతకాలను అందజేశారు. పోలీ సుల సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపా ధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎంపీ డాక్టర్ మల్లురవి, కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఉన్నారు.



ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.తిరుపతయ్య



ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జే.హనుమంతు



చారకొండ హెడ్‌కానిస్టేబుల్ జి.భూపతిరెడ్డి



నాగర్‌కర్నూల్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.పర్వతాలు

## ఎంబీబీఎస్ విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే మర్రి ఆర్థిక సాయం

తాడూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందాయపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య అనే వ్యక్తి కుమారుడైన శివప్రసాద్ గత సంవత్సరం నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటును సాధించాడు. దీంతో అతను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం వైద్య విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.లక్షా 40వేల చెక్కునిచ్చి ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో ఆ విద్యార్థి తండ్రి ఎల్లయ్య మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తిరుపతిరెడ్డి, శేఖర్‌గౌడ్, రాజుగౌడ్, బాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జలీల్ ఉన్నారు.

## ఎస్ఎస్‌సీ విద్యార్థులకు నగదు ప్రదానం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2024-25 సంవత్సరంలో పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు రిటైర్డు హెచ్‌ఎంలు బాలస్వామి, సుదర్శన్‌బాబు స్మారకార్థం శుక్రవారం నగదు ప్రదానం చేశారు. ఈ నగదును సుదర్శన్‌బాబు కుమారుడు డాక్టర్ టి.సంజీవకుమార్ అందజేశారు. మొదటి బహుమతి గణేష్ రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.6వేలు పల్లవి, మూడవ బహుమతి 4వేలు ఝాన్సీ, నాల్గవ బహుమతి సోనాలిక రూ.2వేలు నగదును డాక్టర్ సంజీవ్‌కుమార్ అందజేశారు. అలాగే ఇదే పాఠశాలలో 1996-97 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థి డాక్టర్ సంజీవ్‌కుమార్ కావడం విశేషం. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.